క్లుప్తంగా

గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న అమ్మవారు

ఆస్పరి: మండలంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళ హారతులు తదితర పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీటీసీ సభ్యుడు గాదిలింగప్ప శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన పనులను సక్రమంగా చేసుకుని, రోజుకు రూ.300 వేతనం పొందాలన్నారు. పనులు కావాలని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓను కోరారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ బరెన్ సాహెబ్

చిప్పగిరి: మండల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని ఎంపీడీఓ బరెన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జూటూరు హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు సభలో చదివి వినిపించారు. సభలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జూటూరు హేమలత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యులు రజనీ, సుంకన్న, సుపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకం

మద్దికెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంపకానికి పోత్సాహకాలు అందిస్తున్నాయని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకంలో 5 ఎకరాల్లోపు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటలు పెంచడం వల్ల మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు సైతం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని.. మరిన్ని వివరాలకు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు హనుమాన్ జయంతి



హొళగుంద: మండల కేంద్రానికి సమీపంలోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, మహామంగళహారతి, అలంకారం, అర్చనలు, తదితర పూజలు జరుగుతాయని వెల్లడించారు. భజనా, అన్నదాన కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

నేడు విశేష పూజలు

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకల కోసం ఆయా ఆలయాలను ముస్తాబు చేశారు. కృష్ణగిరి మండలంలో టి.గోకులపాడు, కటారుకొండ, పెనుమాడ తదితర గ్రామాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించనున్నారు. అలాగే దేవాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. వెల్దుర్తి పట్టణ సమీపంలోని హనుమాన్ విగ్రహం, అలాగే యాదరాళ్ల తదితర గ్రామాల్లో జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యాదరాళ్ల గ్రామంలో సప్తమాంకములు నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆలూరు ఆంజనేయస్వామి ఆలయంలో..

ఆలూరు: ఆలూరు సమీపంలోని బెళ్లగుండా ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రయ్.. రయ్


అధ్వానంగా పీసీకొండ రోడ్డు (నాడు),






బీటీ రోడ్డు వేసిన తర్వాత ఇలా (నేడు), అధ్వానంగా ఉన్న పగిడిరాయి-రామలింగాయపల్లి రోడ్డు (నాడు), పగిడిరాయి-రామలింగాయపల్లి రోడ్డు(నేడు)

- బాగుపడిన గ్రామీణ ప్రాంత రోడ్లు
- నూతన రోడ్లతో పాటు దెబ్బతిన చోట్ల మరమ్మతులు
- రహదారుల నిర్మాణాలకు రూ.21.27 కోట్లు ఖర్చు
- పీసీకొండ, ఆర్‌కొత్తూరు రోడ్లతో తీరిన ఏళ్ల నాటి కల
- సాఫీగా సాగుతున్న ప్రయాణం


రాతన నుంచి ఆర్ కొత్తూరుకు వేసిన బీటీ రోడ్డు

తుగ్గలి: గ్రామీణ ప్రాంత రోడ్లకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్లు లేకుండా ఉన్న గ్రామాలు నేడు నూతన రోడ్లతో కొత్త రూపును సంతరించుకున్నాయి. గుంతలు పడిన మట్టి రోడ్లలో అవస్థలు పడుతూ ప్రయాణం చేసిన గ్రామస్తులు ఇప్పుడు రయ్..రయ్ మంటూ దూసుకెళుతున్నారు. గతంలో పలు గ్రామాల రోడ్లు దుస్థితికి చేరినా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. శిథిలావస్థలో ఉన్న రోడ్లను సుందరంగా తీర్చి దిద్దింది. ప్రభుత్వం తుగ్గలి మండలంలో రోడ్ల నిర్మాణాలకు రూ.21.27 కోట్లు ఖర్చు చేసింది. శభాష్‌పురం నుంచి పైచింతల కొండ, రాతన నుంచి ఆర్ కొత్తూరుకు కొత్తగా బీటీ రోడ్లు వేసి ఆ గ్రామస్తుల ఏళ్ల నాటి కల నెరవేర్చింది. మిగిలిన పలు గ్రామాలకు రోడ్లు మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. నాడు గుంతలు పడిన రోడ్లు నేడు అందంగా మెరుస్తున్నాయి. రోడ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణాలకు కృషి చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మండలంలో రోడ్లకు ఖర్చు చేసిన నిధులు ఇలా..

- శభాష్‌పురం నుంచి పైచింతలకొండ వరకు 3.9 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.3.71కోట్లు
- రాతన నుంచి ఆర్‌కొత్తూరు (3.6 కిలోమీటర్లు) బీటీ రోడ్డుకు రూ.3.12 కోట్లు
- రాతన నుంచి చెర్వుతండా వరకు 16 కి.మీల మరమ్మతుల కోసం స్పెషల్ రిపేర్ ఫండ్స్ రూ.5 కోట్లు
- రూ.5.50 కోట్లతో పగిడిరాయి నుంచి లంకాయపల్లి(12.7 కి.మీ) వరకు రోడ్డు మరమ్మతులు
- జొన్నగిరి నుంచి పెండేకల్లు రైల్వే జంక్షన్ వరకు 16 కిలోమీటర్ల మరమ్మతులకు రూ.1.99 కోట్లు
- ఉప్పర్లపల్లి నుంచి బొల్లవానిపల్లి (3కి.మీ) రూ.20 లక్షలతో బీటీ రోడ్డు మరమ్మతులు
- జొన్నగిరి నుంచి సుంకులమ్మ మండల సరిహద్దు వరకు రూ.1.65 కోట్లతో బీటీ రోడ్డు మరమ్మతులు
- రూ.10లక్షలతో తుగ్గలి నుంచి పెరవలి రోడ్డు మరమ్మతులు

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా సాగుచేసే వేరుశనగ పంట కోసం కదిరి లేపాక్షి 12,13 రకాలు 40 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని.. ఆసక్తి గల రైతులు తీసుకోవాలని ఏఓ రవి తెలిపారు. క్వింటాల్ రూ.5,220 ఉందన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి విత్తనాలు పొందాలని సూచించారు.

బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్ నగదు

తుగ్గలి: సామాజిక పింఛన్లు శనివారం(నేటి) నుంచి ఈనెల 5వ తేదీ వరకు పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గంలో 34,254 మంది లబ్ధిదారులకు రూ.8,90,97000 పంపిణీ చేయాల్సి ఉంది. వీరిలో మే నెలలో బ్యాంకు ఖాతాలకు జమచేసిన లబ్ధిదారులకు ఈనెల కూడా అదే విధంగా జమ చేయన్నారు. మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దనే పింఛన్ డబ్బులు అందజేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

బాణసంచా సీజ్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని సుధా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను శుక్రవారం సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు రూ.15 వేలు విలువ చేసే బాణసంచాను గోదాములో ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. స్టాకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా బాణసంచా కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల కలయిక


హోసూరు జెడ్పీహైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు జెడ్పీహైస్కూల్‌లో 2005-2006 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ నాటి గురువులను ఆహ్వానించి వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపాడు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకమ్మ, ఈశ్వరప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం


డిపో కంట్రోలర్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పత్తికొండ రూరల్: పత్తికొండ ఏపీఎస్ఆర్టీసీ డిపో కంట్రోలర్ ఉప్పర రామన్న శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో ఇన్‌చార్జి మేనేజర్ కేవీఆర్ రెడ్డి, డిపో క్లర్క్ సీఎం. రావు, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఈవీఎం రాజు తదితరులు ఆయన్ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. 2004లో ఉత్తమ కండక్టర్‌గా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్యారేజీ ఇన్‌చార్జి కృష్ణమూర్తి, యూనియన్ నాయకులు పరిమళ బాషా, జి.నాగరాజు, ప్రకాశ్, వీరన్న, జయన్న తదితరులు పాల్గొన్నారు.


సీడీపీఓ దంపతులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సన్మానం

ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరిలో శుక్రవారం పదవీ విరమణ పొందిన సీడీపీఓ నిర్మాలాదేవి, బ్రహ్మారెడ్డి దంపతులను ఆస్పరి, దేవనకొండ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శాలువ, పూలమాలలతో సన్మానించారు. సీడీపీఓ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివ లింగమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

హరిశ్చంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

దేవనకొండ: అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన జిల్లెడబుడకల గ్రామానికి చెందిన హరిశ్చంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లెడబుడకల గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నష్టపరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. సీపీఎం నాయకులు వీరశేఖర్, అశోక్, సూరి, వీరేంద్ర ఉన్నారు.

రైతుల అవసరం మేరకు విత్తనాలు అందించాలి

దేవనకొండ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలవ్యాప్తంగా ఆర్‌బీకేల వద్ద రైతు సంఘం నాయకులతో నిరసనలు తెలిపారు. పల్లెదొడ్డి, దేవనకొండ, కుంకనూరు, తెర్నెకల్, కోటకొండ, నెల్లిబండ, కప్పట్రాళ్ల, జిల్లెడబుడకల, చెల్లిచెలిమల గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. రైతులకు పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, శ్రీరాములు, లింగన్న పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ఆలూరు: మండలంలోని కాత్రికి గ్రామంలో రంగనాథస్వామి, వేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వేద పండితుడు విష్ణుశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చకులు, గంగపూజ, కుంకుమార్చన, ఫల, పుష్ప సమర్పణ, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సమూర్తులను మేళతాళాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, పాలక కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో గ్రామంలోని ఎదరు బసన్న గుడి వరకు భాజాభజంత్రీలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, డోన్, బళ్లారి, శిరుగుప్ప, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రమేష్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగస్వామి, లక్ష్మిరెడ్డి, గోవిందు, ఈరన్న, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, ఆలూరు ఎంపీపీ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు ఎస్ఐ ఓబులేశు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి

నీటి కష్టాలు తీర్చండి మహాప్రభో


పంచాయతీ కార్యదర్శికి గోడు వెల్లబోసుకుంటున్న మహిళలు

హొళగుంద: వారాల తరబడి తాగునీటి కోసం ఎదురు చూస్తున్నా బిందె నీరు కూడా రావడం లేదని హొళగుంద 5వ వార్డు, బస్టాండ్ ఏరియాకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యలయానికి వచ్చి సెక్రటరీ రాజశేఖర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. మల్లమ్మ, యంకమ్మ, మారెమ్మ, బసవరాజ్, సిద్ధప్ప, గాదెప్ప తదితరులు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న జనాభాకు తగినట్లు నీరు సరఫరా చేయడం లేదన్నారు. కుటుంబానికి రెండు బిందెల నీరు కూడా రావడం లేదని వాపోయారు. ఎప్పుడు నీరు వస్తుందో తెలియదని.. పనులు మానుకుని ఇంటి వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. చర్యలు తీసుకుంటామని కార్యదర్శి చెప్పడంతో వెనుదిరిగారు.


వర్షాకాలంలో వంకను దాటేందుకు ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు (ఫైల్)

రోడ్డు దాటేదెలా?


అధ్వానంగా ఉన్న చిన్నహ్యాట-వందవాగిలి క్రాస్ రోడ్డు

హొళగుంద: మండల పరిధిలోని చిన్నహ్యాట-వందవాగిలి క్రాస్ రోడ్డు కోతకు గురై, ముళ్లకంపలు పెరిగి రాళ్లు, రప్పలతో అధ్వానంగా మారింది. దీంతో చిన్నహ్యాట గ్రామస్తులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదోని రోడ్డులో వచ్చే గ్రామాలతో పాటు ఆదోనికి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. చిన్నహ్యాట, బీజీహళ్లీ, పెద్దహ్యాట గ్రామస్తులు ఈ మార్గం నుంచి ఆదోని తదితర ప్రాంతాలకు వెళ్లడానికి సుమారు 12 కి.మీమీ దూరం తగ్గుతుంది. అయితే రోడ్డు అధ్వానంగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫలితాలెలా ఉన్నా సంయమనం ముఖ్యం


మాట్లాడుతున్న సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి


బాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

వెల్దుర్తి(కృష్ణగిరి): మరో నాలుగు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఫలితాలు ఎలా ఉన్నా ఆయా పార్టీలు సంయమనం పాటించడం ముఖ్యమని సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఫలితాల ముందు, తర్వాత ఎలాంటి గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఫలితాల అనంతరం విజయోత్సవాలకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎవ్వరినీ ఉపేక్షించమన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

హాలహర్వి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బాపురం, పచ్చారపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా పెట్రోల్ లూజు బాటిళ్లలో అమ్మినా, టపాసులను అమ్మినా కాల్చినా, గుంపులుగా తిరిగినా అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు ముగిసేంతవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. బహిరంగ సమావేశాలు, విజయోత్సవర్యాలీలు చేపద్దరాదని సూచించారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

విజయోత్సవాలు నిషేధం

మద్దికెర: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ నెల 4వ తేదీ ఫలితాల సందర్భంగా విజయోత్సవాలు నిషేధమని పత్తికొండ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వివిధ పార్టీల నాయకులకు నోటీసులు అందజేశారు. ఫలితాలు ఎలా ఉన్నా సోదర భావంతో మెలగాలని సూచించారు. ఘర్షణలు, గొడవలకు తావులేకుండా వ్యవహరించాలన్నారు. ర్యాలీలు చేసినా, బాణాసంచా పేల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కడైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ ఈరన్న హెచ్ఎంలను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, హెచ్ఎంకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం ప్రాథమిక లక్ష్యాలను సాధించాలన్నారు. పిల్లలకు పోషకాహార స్థితిని మెరుగుపరచడానికి కృషి చేయలన్నారు. విద్యార్థుల సమతుల్య ఆహారం, వారి పెరుగుదల, అభివృద్ధికి అవసరమైన పోషకాలను అందించాలన్నారు. విద్యార్థులకు ఆకలి అనే అడ్డంకిని తొలగించడం, వారి పిల్లలను పాఠశాలలకు పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించడం ద్వారా పాఠశాలలో హాజరు శాతాన్ని పెంచవచ్చని తెలిపారు. నాణ్యమైన భోజనం అందించేలా వంట ఏజెన్సీలు కృషి చేయలని సూచించారు. పాఠశాలలో వంటచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ వంటలపై అవగాహన కల్పించారు.